RNI NO.APTEL/2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ | సంపుటి : 20 | సంచిక : 300 | పబ్లిషర్ : కొక్కురవికుమార్ | ఆదివారం, సెప్టెంబర్, 20, 2026 | పేజీలు : 4 | వెల : రూ. 1 - 00

## కారు కాలువలో పడి ఎనిమిది మంది మృతి

మధ్యప్రదేశ్: అదుపుతప్పి సమీపంలోని లోతైన మురుగు కాలువలోకి (డ్రైన్) దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘోర దుర్ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారిలో ఎనిమిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ షాకింగ్ సంఘటన మధ్యప్రదేశ్‌లోని అగర్ మాల్వా జిల్లాలో శనివారం అత్యంత విషాదకరమైన రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక పోలీసు ఉన్నతాధికారులు ప్రకారం.. ప్రమాదం జరిగిన సమయంలో వాహనంలో పలువురు ప్రయాణికులు ఉండగా, నీటి ప్రవాహం, బురద కారణంగా కారు నుంచి బయటకు రాలేక ఊపిరాడక ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు.

## డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. వైట్‌హౌ స్‌లోకి సీఎన్ఎన్, ఎంఎస్‌నౌ, పొలిటికో వార్తా సంస్థల ప్రవేశంపై నిషేధం విధించారు. తనపై తప్పుడు వార్తలు ప్రచురిస్తున్నందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. తనపై ప్రతికూల వార్తలు రాసే మరిన్ని వార్తా సంస్థలపైనా భవిష్యత్తులో
వేటు తప్పదని పేర్కొన్నారు. మరోవైపు గ్రీన్‌లాం డ్‌కు సంబంధించి డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. గ్రీన్‌లాండ్ భద్రతపై డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌లతో శాశ్వత ఒప్పందం కుదిరినట్లు ట్రంప్ వెల్లడించారు. ఈ ఒప్పందం ప్రకారం గ్రీన్‌లాండ్ భద్రత, ఇతర అవసరాలపై అమెరికాకు శాశ్వత నియంత్రణ ఉండనుంది.

# వికసిత్ భారత్ లక్ష్యంలో

## తెలంగాణ కీలక పాత్ర: భట్టి విక్రమార్క



హైదరాబాద్, సెప్టెంబర్ 19: వికసిత్ భారత్ లక్ష్య సాధనలో తెలంగాణ రాష్ట్రం కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం తెలంగాణ వాటా ఉన్న స్థాయి నుంచి 5 శాతం నుంచి 10 శాతానికి పెంచే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఇందుకోసం కేవలం ప్రభుత్వ రుణాలపై ఆధారపడే విధానానికి పరిమితం కాకుండా ప్రైవేట్, సంస్థాగత పెట్టుబడులను పెద్ద ఎత్తున సమీకరించే దిశగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలను తీసుకురావడంతో పాటు యువతకు మెరుగైన అవకా శాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ యువతే రాష్ట్రానికి అతిపెద్ద బలమని, వారి నైపుణ్యాలు, ప్రతిభను వినియోగించుకునేలా ఆర్థికాభివృద్ధి, ఉపాధి రంగాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ సమతుల్య అభివృద్ధి ఫలాలు అందేలా విధానాన్ని అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. సుమారు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయడం ద్వారా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కొత్త ఆర్థిక, పారిశ్రామిక అవకాశాలను సృష్టించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రైవేట్ పెట్టుబడుల సమీకరణకు మరింత ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోందని క్ష్యాలను సాధించేందుకు కేంద్రం.. రాష్ట్రాలు సహకార సమాఖ్య స్ఫూర్తితో కలిసి పనిచేయాలని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కేంద్రం--రాష్ట్రాల మధ్య సమన్వయం, పెట్టుబడుల ప్రో త్సాహం, యువతకు అవకాశాల కల్పనతో తెలంగాణను వేగవంతమైన ఆర్థికాభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# పారిస్ ఒప్పందాన్ని నిలబెట్టాం : ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కొనేందుకు భారత్ తీసుకుంటున్న చర్యలను ప్రధాని నరేంద్ర మోదీ వివరించారు. పర్యావరణం, వాతావరణ మార్పులపై శనివారం జరిగిన అంతర్జాతీయ సదస్సులో మాట్లాడిన ఆయన.. భారత్‌లో తలసరి కార్బన్ ఉద్గారాలు ప్రపంచ సగటుతో పోలిస్తే సగానికంటే తక్కువగా ఉన్నాయని అన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో తలసరి కార్బన్ ఉద్గారాలు భారత్ కంటే సుమారు ఆరు రెట్లు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో భారత్ పునరుత్పాదక ఇంధన రంగంలో గణనీయమైన పురోగతి సాధించిందని మోదీ తెలిపారు. ముఖ్యంగా సౌర విద్యుత్ సామర్థ్యం 2 గిగావాట్ల నుంచి 160 గిగావాట్లకు పైగా పెరిగిందన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు దేశ విద్యుత్ అవసరాలను తీర్చడంలో పునరుత్పాదక ఇంధనం కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. పారిస్ వాతావరణ ఒప్పందంలో భారత్ చేసిన కట్టుబాట్లను నిర్ణీత గడువుకు ముందుగానే సాధించిందని ప్రధాని తెలిపారు. జీ20 దేశాల్లో ఈ లక్ష్యాలను ముందుగానే పూర్తి చేసిన దేశంగా భారత్ నిలిచిందని పేర్కొన్నారు. నాన్-ఫాసిల్ ఇంధన సామర్థ్యం, సౌర విద్యుత్ విస్తరణ, కార్బన్ ఉద్గారాల తగ్గింపు వంటి అంశాల్లో భారత్ సాధించిన పురోగతిని ఆయన ప్రస్తావించారు. 'పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ' పథకం ద్వారా ఇళ్లనే విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలుగా మార్చే ప్రయత్నం జరుగుతోందని మోదీ చెప్పారు. ఇప్పటివరకు 50 లక్షలకు పైగా ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కో ఇంటికి దాదాపు రూ. 80 వేల వరకు ప్రభుత్వ సహాయం అందుతున్నట్లు వివరించారు. కుసుమ్ పథకం కింద సుమారు 30 లక్షల మంది రైతుల పొలాల్లో సౌర విద్యుత్ పంపులను ఏర్పాటు చేసినట్లు ప్రధాని తెలిపారు. అలాగే 'వన్ నేషన్ వన్ గ్రిడ్' ప్రాజెక్టు పూర్తయిందని చెప్పారు. దేశవ్యాప్తంగా కోట్లాది ఇళ్లలో ఎల్ఈడీ బల్బుల వినియోగం పెరగడం వల్ల విద్యుత్ ఆదాతో పాటు ఉద్గారాల తగ్గింపునకు కూడా సహకారం అందిందన్నారు. వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు భారత్ అంతర్జాతీయ స్థాయిలో పలు కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని మోదీ తెలిపారు. వన్ వరల్డ్ వన్ గ్రిడ్, ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్, గ్లోబల్ బయోఫ్యూయల్ అలయన్స్, ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్, మిషన్ లైఫ్ వంటి కార్యక్రమాలను ఆయన ప్రస్తావించారు. భారతదేశంలోని ప్రాచీన పర్యావరణ ఆలోచనలను ఆధునిక సాంకేతికతతో అనుసంధానిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. పవన విద్యుత్ సామర్థ్యం మూడు రెట్లు పెరిగిందని, జల విద్యుత్ సామర్థ్యం కూడా గణనీయంగా విస్తరించిందని పేర్కొన్నారు.

## 'నాలాపై జన్వాడ ఫాంహౌస్ నిర్మాణం'..


# కాంగ్రెస్ ఎంపీల సంచలన కామెంట్స్



రంగారెడ్డి, సెప్టెంబర్ 19: జన్వాడ ఫాంహౌస్‌పై కాంగ్రెస్ ఎంపీలు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫాంహౌస్ నిర్మాణానికి అనుమతులు లేవని, నాలాపై ఫాంహౌస్‌ను కట్టారంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. శనివారం కాంగ్రెస్ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేల బృందం జన్వాడ ఫాంహౌస్‌కు వెళ్లింది. ఈ సందర్భంగా ఫాంహౌస్ భూములను ప్రజాప్రతినిధుల బృందం పరిశీలించింది. అనంతరం కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. అక్రమాలను ప్రజలకు తెలియజేయాలనే జన్వాడ ఫాంహౌస్‌కు వచ్చామని తెలిపారు. ఫాంహౌస్‌ను నాలాపై కట్టారని.. దీని నిర్మాణానికి అనుమతులు లేవన్నారు. ఫాంహౌస్ ఎవరి పేరుపై ఉందో స్పష్టత లేదని మల్లు రవి అన్నారు. ఫాంహౌస్ దగ్గరకు వస్తే ప్రదీప్‌రెడ్డి కేసులు పెడతామన్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ అన్నారు. అసలు ఇన్ని ఎకరాల్లో ఫాంహౌస్ ఎలా కట్టుకున్నారని ప్రశ్నించారు. జన్వాడ ఫాంహౌస్ దగ్గర డ్రోన్ ఎగరవేస్తే రేవంత్‌రెడ్డిపై కేసు పెట్టారని మండిపడ్డారు. కేటీఆర్ స్నేహితుడే ప్రదీప్‌రెడ్డి అని.. ఆయనకు ఫాంహౌస్ భూమి ఎలా వచ్చిందని నిలదీశారు. కేటీఆర్ జన్వాడ ఫాంహౌస్‌లో అద్దెకు ఉంటున్నారని ప్రదీప్ చెప్పారని తెలిపారు. పురపాలక మంత్రిగా కేటీఆర్ అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. అక్రమంగా జన్వాడలో ఫాంహౌస్ నిర్మించారని ఆరోపణలు గుప్పించారు. సత్యం రామలింగరాజు భూముల్లో ఫాంహౌస్ నిర్మించారని తెలిపారు. కేటీఆర్ సతీమణి శైలిమ పేరుతో ఇక్కడ భూమి ఉందన్నారు. కేటీఆర్ అత్త పేరుపై కూడా భూములు ఉన్నాయని చెప్పారు. ఈ భూమలన్నీ శతబిష ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీవి అని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. జన్వాడ ఫాంహౌస్ వద్ద కాసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఫాంహౌస్ భూములను పరిశీలించేందుకు వచ్చిన కాంగ్రెస్ నేతల బృందాన్ని బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకుని పక్కకు నెట్టేశారు. ఈ క్రమంలో హైటెన్షన్ నెలకొంది.

## బ్రిక్స్ సదస్సుతో ప్రపంచ వేదికపై

# భారత్ స్థానం మరింత బలోపేతం!



**న్యూఢిల్లీ, సెప్టెంబర్, 19:** న్యూఢిల్లీ వేదికగా జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు తర్వాత అంతర్జాతీయ వేదికపై భారత్‌కు దౌత్యపరమైన ప్రాధాన్యం మరింత స్పష్టమైందని 'డైరెక్టస్' నివేదిక పేర్కొంది. ముఖ్యంగా 2025 పహల్గామ్ ఉగ్రదాడిని బ్రిక్స్ న్యూఢిల్లీ డిక్లరేషన్‌లో తీవ్రంగా ఖండించడం, సరిహద్దు దాటి ఉగ్రవాదుల కదలికలు, ఉగ్రవాదానికి నిధులు, సురక్షిత స్థావరాలకు వ్యతిరేకంగా స్పష్టమైన వైఖరి తీసుకోవడం భారత్ చాలాకాలంగా ప్రస్తావిస్తున్న అంశాలకు మద్దతు లభించినట్లయిందని తెలిపింది. పహల్గామ్ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిని బ్రిక్స్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఉగ్రవాదాన్ని ఏ రూపంలో ఉన్నా నేరపూరితమైనదిగా, సమర్థించలేనిదిగా పేర్కొన్నాయి. ఉగ్రవాద చర్యలకు పాల్పడినవారితో పాటు వారికి మద్దతు ఇచ్చేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూడా డిక్లరేషన్ స్పష్టం చేసింది. అయితే డిక్లరేషన్‌లో పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించలేదు. ఈ అంశాన్ని దాచాల్సిన అవసరం లేదని, అదే సమయంలో అతిగా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం కూడా లేదని 'డైరెక్టస్' పేర్కొంది. వివిధ భౌగోళిక, రాజకీయ ప్రయోజనాలు ఉన్న దేశాలు కలిసి ఉగ్రవాదంపై ఇలాంటి భాషను అంగీకరించడం భారత్‌కు దౌత్యపరంగా ముఖ్యమైన పరిణామమని విశ్లేషించింది. ఉగ్రవాదాన్ని కేవలం దాడి చేసిన వ్యక్తితో మాత్రమే పరిమితం చేయలేమని నివేదిక పేర్కొంది. ఆయుధాలు, శిక్షణ, నిధులు, సమాచార వ్యవస్థలు, నియామక నెట్‌వర్క్‌లు, సురక్షిత ప్రాంతాల వంటి మొత్తం వ్యవస్థపై చర్యలు అవసరమని తెలిపింది. ఈ అంశాలపై బ్రిక్స్ డిక్లరేషన్‌లో వచ్చిన ప్రస్తావన ప్రాధాన్యమైనదని పేర్కొంది. అదే సమయంలో భారత్ అనుసరిస్తున్న బహుముఖ విదేశాంగ విధానాన్ని కూడా నివేదిక ప్రస్తావించింది. అమెరికాతో సంబంధాలను విస్తరిస్తూనే రష్యాతో భాగస్వామ్యాన్ని భారత్ కొనసాగిస్తోంది. క్వాడ్‌లో సభ్యత్వంతో పాటు బ్రిక్స్‌లో కీలక పాత్ర పోషిస్తోంది. చైనాతో విభేదాలు ఉన్నప్పటికీ.. జాతీయ ప్రయోజనాలకు అవసరమైన చోట ఆ దేశంతో చర్చలు కొనసాగిస్తోంది. వివిధ దేశాల మధ్య భిన్నమైన అభిప్రాయాలు ఉన్నప్పటికీ.. భారత్ తన భద్రతకు సంబంధించిన అంశాలను బ్రిక్స్ వంటి వేదికపై చర్చకు తీసుకురాగలిగిందని 'డైరెక్టస్' విశ్లేషించింది. దీనివల్ల ఏ ఒక్క భౌగోళిక రాజకీయ కూటమిపై ఆధారపడకుండా స్వతంత్రంగా వ్యవహరించే దేశంగా భారత్ తన దౌత్యపరమైన స్థాయిని మరింత స్పష్టంగా చూపించిందని నివేదిక పేర్కొంది.

# మోడీ పాలనలో సామాన్యుడికి ఉపశమనం లేదు

## సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్, 19:** అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ పడిపోతుండగా, అధికార ప్రభుత్వం "కల్పిత ఉపాధి గణాంకాలను" ప్రదర్శిస్తోందని ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. లక్నోలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కరెన్సీ విలువపై బీజేపీ గతంలో చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా విమర్శించారు. దేశంలో తీవ్రమవుతున్న జీవనోపాధి సంక్షోభాన్ని ఆయన ఎత్తి చూపారు. "ఒకప్పుడు డాలర్ ఎటువైపు వెళుతోందని ప్రశ్నించిన వారు, ఇప్పుడు వెనక్కి తిరిగి చూసి డాలర్‌తో పోలిస్తే రూపాయి ఎక్కడ నిలుస్తుందో గమనించాలి" అని కేంద్రాన్ని ఉద్దేశించి యాదవ్ అన్నారు. అదుపు తప్పిన ద్రవ్యోల్బణం సామాన్య కుటుంబాలను దెబ్బతీస్తున్న తరుణంలో, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు మోడీ సర్కార్ అంకెల గారడీ చేస్తోందని ఆయన మండిపడ్డారు.


## కేసీఆర్ కుటుంబ సభ్యుల భూముల విచారణపై

# కట్టుబడి ఉన్నాం: మహేశ్ గౌడ్



ఢిల్లీ, సెప్టెంబర్ 19: మాజీ సీఎం కేసీఆర్‌పై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబ సభ్యుల భూముల విచారణపై కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఢిల్లీలో మహేశ్ కుమార్ గౌడ్ శనివారం మాట్లాడారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌కు సెండాఫ్ చెప్పడానికి ఢిల్లీకి తాము వచ్చామని తెలిపారు. కేసీఆర్ కుటుంబ భూముల వ్యవహారంపై అధికారుల విచారణ కొనసాగుతోందని చెప్పారు. ఇన్ని వందల ఎకరాల భూములు కేసీఆర్ కుటంబానికి ఎలా వచ్చాయని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ఆ భూములు వారివి అయితే పేపర్లు చూపించాలని సవాల్ చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు, దళితులకు సొంతింటి కల నెరవేర్చడమే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. 22ఏ పాపం కాంగ్రెస్ పార్టీది కాదని తెలిపారు. 22ఏ పై కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాల నేతలు విష ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాళేశ్వరం విచారణపై సీబీఐకి లేఖ రాశామని, విచారణ ఎందుకు చేయడం లేదో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు చెప్పాలని సవాల్ చేశారు. ఈ నెలాఖరులోగా పెండింగ్ డీసీసీలు, కార్పొరేషన్, పదవులు పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మహాగణపతి పూజ కార్యక్రమంలో మహేశ్ గౌడ్ పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో ఘనంగా వినాయక పూజ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలవాలని, పాడిపంటలతో రైతులు సుభిక్షంగా ఉండాలని గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన దిశగా ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్‌గా ఉండాలని భగవంతుడిని ప్రార్థించానని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కేసీఆర్ చేసిన దారుణాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. 'హైకోర్టు తీర్పు బీఆర్ఎస్‌కి కనువిప్పు. దానం నాగేందర్ తీర్పు మాకు చెంపపెట్టు అంటున్నారని, కానీ బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఇది చెంపపెట్టు. తలసాని శ్రీనివాస్ యాదవ్, సబిత ఇంద్రారెడ్డిని గులాబీ పార్టీలో చేర్చుకొని మంత్రి పదవులు ఇచ్చారు. హై కోర్టు తీర్పు ఇచ్చింది.. అదే మా వాళ్లు బీఆర్ఎస్‌లో చేరినప్పుడు జడ్జిమెంట్ ఉండి ఉంటే వేరే విధంగా ఉండేది. తప్పుడు సంస్కృతిని తీసుకొచ్చింది బీఆర్ఎస్. మా ప్రభుత్వాన్ని కూలగొడతామని చెప్పారు. హైకోర్టు తీర్పు బీఆర్ఎస్‌కు చెంపపెట్టు. తలసాని, సబిత ఇంద్రారెడ్డి మంత్రులను చేశారు. ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు బీజేపీకి లేదు. వివిధ రాష్ట్రాల్లో బీజేపీ వేరే పార్టీల నేతలను చేర్చుకున్నారు.

# డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం..



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. వైట్‌హౌస్‌లోకి సీఎన్ఎన్, ఎంఎస్‌నౌ, పొలిటికో వార్తా సంస్థల ప్రవేశంపై నిషేధం విధించారు. తనపై తప్పుడు వార్తలు ప్రచురిస్తున్నందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. తనపై ప్రతికూల వార్తలు రాసే మరిన్ని వార్తా సంస్థలపైనా భవిష్యత్తులో వేటు తప్పదని పేర్కొన్నారు. మరోవైపు గ్రీన్‌లాండ్‌కు సంబంధించి డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. గ్రీన్‌లాండ్ భద్రతపై డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌లతో శాశ్వత ఒప్పందం కుదిరినట్లు ట్రంప్ వెల్లడించారు. ఈ ఒప్పందం ప్రకారం గ్రీన్‌లాండ్ భద్రత, ఇతర అవసరాలపై అమెరికాకు శాశ్వత నియంత్రణ ఉండనుంది. తమ అనుమతి లేకుండా ఏ దేశాల స్థావరాలు ఇక్కడ ఏర్పాటు ఉండబో దని తెలిపారు. త్వరలోనే గ్రీన్‌లాండ్‌లో భారీ సైనిక స్థావరం ఏర్పాటు చేస్తామని తన ట్రూత్ సోషల్ మీడియా ద్వారా డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు.

## సంపాదకీయం

### దిగజారుతున్న జీవన ప్రమాణాలు..!

యుద్ధాలు, చమురు ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, పెరుగుతున్న ప్రభుత్వ అప్పులు దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా సామాన్య, మధ్యతరగతి ప్రజల ఆదాయాలు, కొనుగోలు శక్తి తగ్గి జీవన ప్రమాణాలు రోజురోజుకూ దిగజారుతున్నాయి. దేశవ్యాప్తంగా 2016లో పెద్దనోట్ల రద్దుతో ప్రారంభమైన ఆర్థిక అస్థిరత కరోనా విలయంతో మరింత తీవ్రమైంది. అనంతరం రష్యా?ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా ఉద్రిక్తతలు, తాజాగా అమెరికా?ఇరాన్ మధ్య జరుగుతున్న ఘర్షణలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తున్నాయి. ముఖ్యంగా మన దేశం చమురు, గ్యాస్ అవసరాల్లో సుమారు 85 శాతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో అంతర్జాతీయ పరిణామాల ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడుతోంది. హోర్ముజ్ జలసంధి చుట్టూ నెలకొన్న ఉద్రిక్తతలతో చమురు సరఫరా, రవాణాపై అనిశ్చితి పెరగడంతో ముడి చమురు ధరలు భారీగా పెరిగే పరిస్థితి ఏర్పడింది. చమురు ధరలు పెరిగితే దాని ప్రభావం కేవలం పెట్రోల్, డీజిల్‌కే పరిమితం కాదు. రవాణా ఖర్చులు పెరగడంతో నిత్యావసర వస్తువులు, కూరగాయలు, ఆహార పదార్థాల ధరలు కూడా పెరుగుతాయి. ఇప్పటికే పెరుగుతున్న ద్రవ్యోల్బ ణంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. రిజర్వ్ బ్యాంక్ గణాంకాల ప్రకారం ఆహార ద్రవ్యోల్బణం 5.33 శాతానికి చేరిన పరిస్థితుల్లో కూరగాయల ధరలు కూడా అధిక స్థాయిలో కొనసాగుతున్నాయి. ఆదాయాలు పెరగకపోగా ఖర్చులు పెరగడంతో ప్రజల కొనుగోలుశక్తి తగ్గి జీవన ప్రమాణాలు దిగజారుతున్నాయి. ఇదే సమయంలో దేశంపై పెరుగుతున్న అప్పుల భారం మరో ఆందోళనకర అంశంగా మారింది. కేంద్ర ప్రభుత్వం 2021లో వెల్లడించిన గణాంకాల ప్రకారం అప్పు రూ. 138.66 లక్షల కోట్లు ఉండగా, కేవలం ఐదేళ్లలో మరో రూ. 62.5 లక్షల కోట్ల అప్పు పెరిగి మొత్తం రూ. 201.17 లక్షల కోట్లకు చేరిందని గణాంకాలు పేర్కొంటున్నాయి. అంటే సగటున ప్రతి భారతీయుడి తలపై సుమారు రూ. 1.36 లక్షల అప్పు భారం ఉన్నట్లవుతోంది. అభివృద్ధి పేరుతో తీసుకుంటున్న ఈ రుణాల్లో గణనీయమైన భాగం వడ్డీల చెల్లింపులకే వెచ్చించాల్సి వస్తుండటంతో ప్రభుత్వ ఖజానాపై భారం పెరుగుతోంది. రుణాలు తీసుకుని సంపద, ఉద్యోగాలు, ఉత్పాదక రంగాలు పెరగాల్సిన చోట అవి ప్రజల జీవితాలను మెరుగుపరచకపోతే భవిష్యత్ తరాలపై మరింత రుణభారం పడే ప్రమాదం ఉంది. దేశ ఆర్థికాభివృద్ధి గణాంకాలు ఒకవైపు ఆశాజనకంగా చూపుతున్నప్పటికీ, సామాన్యుల వాస్తవ పరిస్థితులు మరో విధంగా ఉన్నాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గడం, ఖాళీ ప్రభుత్వ పోస్టులు భర్తీ కాకపోవడం, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు పెరగడం యువతలో ఆందోళన కలిగిస్తోంది. ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తా మన్న హామీలకు అనుగుణంగా అవకాశాలు లభించకపో వడంతో యువత నిరాశకు గురవుతోంది. ఉద్యోగాల కోసం పోరాడుతున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు వారిపై కఠిన చర్యలకు దిగడం ప్రజాస్వామ్య వ్యవస్థలో చర్చనీయాంశంగా మారుతోంది. మరోవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి వ్యవసాయ రంగంపై కూడా తీవ్ర ప్రభావం పడుతోంది. నీటి నిల్వలు తగ్గిపోవడం, సాగునీరు, తాగునీటి సమస్యలు, వర్షాలపై ఆధారపడిన రైతుల్లో ఆందోళన పెరగడం భవిష్యత్ ఆహార భద్రతపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ముడి చమురు ధరల పెరుగుదల, ట్రంప్ సుంకాలు, కార్పొరేటీకరణ ప్రభావంతో అసంఘటిత కార్మికుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. నిరుద్యోగం పెరుగుతుండగా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు కూడా అనేక సవాళ్లను ఎదుర్కొం టున్నాయి. కృత్రిమ మేధ ప్రభావంతో సాఫ్ట్‌వేర్ రంగంలో కూడా ఉద్యోగాలపై ఆందోళనలు పెరుగుతున్నాయి. ప్రజల కొనుగోలు శక్తి తగ్గడంతో వాహనాల విక్రయాలు, రియల్ ఎస్టేట్ వంటి రంగాల్లో కూడా మందగమనం కనిపిస్తోంది. ఒకప్పుడు వేగంగా పెరిగిన టూ వీలర్ అమ్మకాల వృద్ధి రేటు 10.7 శాతం నుంచి 3.5 శాతానికి పడిపోవడం ప్రజల కొనుగోలు శక్తి పరిస్థితిని సూచిస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు వ్యవసాయ, పారిశ్రామిక రంగాల బలోపేతంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. బడ్జెట్ కేటాయింపులు పెంచడంతో పాటు ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు రాయితీలు, రైతులకు గిట్టుబాటు ధరలు, సబ్సిడీలు కల్పించాలి. విద్య, వైద్య రంగాలను బలోపేతం చేసి, ప్రభుత్వ రంగంలో ఖాళీ పోస్టులను భర్తీ చేసి శాశ్వత ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. కేవలం దేశంలోని ఒక శాతం కార్పొరేట్ వర్గాల సంపద పెరగడమే దేశాభివృద్ధి కాదని పాలకులు గుర్తించాలి. దేశంలో అధిక సంఖ్యలో ఉన్న సామాన్య, మధ్య తరగతి ప్రజల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధి ద్వారానే నిజమైన వికసిత భారత్ సాధ్యం తప్ప ప్రచార ఆర్భాటలతో కాదు. ప్రజల ఆదాయాలు పెరిగి, కొను గోలు శక్తి మెరుగుపడి, జీవన ప్రమా ణాలు పెరిగినప్పుడే దేశ ఆర్థికాభివృద్ధికి నిజమైన అర్థం.

పబ్లిషర్ : కొక్కు రవికుమార్

# గోదావరి తీరాన విద్యా వైభవం...



దాతృత్వానికి చిరునామాగా నిలిచిన మధ్వాచారి రాధాబాయమ్మ మహోన్నత త్యాగం ధర్మపురి పట్టణ విద్యా వికాస చరిత్రలో ఒక సువర్ణాక్షర లిఖిత అధ్యాయం. పుణ్య గోదావరి నదీ తీరాన, శ్రీ లక్ష్మీనరసింహస్వామి దివ్య సన్నిధిలో వెలసిన ధర్మపురి క్షేత్రం కేవలం ఆధ్యాత్మికతకే కాక, వేద వాఙ్మయానికి, సంస్కృతికి, సాహితీ వైభవానికి పుట్టినిల్లు. అటువంటి చారిత్రక పుణ్యభూమిపై అజ్ఞానాంధకారాన్ని పారద్రోలి, జ్ఞానజ్యోతులను ప్రసరింప జేసేందుకు ఆనాడు మధ్వాచారి రాధాబాయమ్మ చేసిన భూదానం సామాన్యమైనది కాదు. విద్య అనేది వ్యక్తి వికాసానికే కాక, సమస్త సమాజ గమనాన్ని సమూలంగా మార్చగల దివ్యౌషధమని విశ్వసించిన ఆ మహనీయురాలు, నాటి కాలంలోనే విద్యావ్యాప్తి కోసం తన అమూల్యమైన ఆస్తిని త్యాగం చేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఒకప్పుడు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విద్యాసంస్థల స్థాపనకు భూమిని సేకరించడం ప్రభుత్వాలకు కూడా అత్యంత క్లిష్టమైన సవాలుగా ఉన్న ఆ రోజుల్లో, రాధాబాయమ్మ ముందుచూపుతో సమాజ శ్రేయస్సును కాంక్షించి అత్యంత విలువైన ఆరు ఎకరాల తొమ్మిది గుంటల విశాలమైన భూమిని నిస్వార్థంగా దానమిచ్చారు. సుమారు ఆరు దశాబ్దాల క్రితం జరిగిన ఈ మహోన్నత భూదానం ధర్మపురి విద్యా సౌధాల నిర్మాణానికి అత్యంత పటిష్టమైన పునాదిరాయి వేసింది. నాడు ప్రభుత్వ నిధులతో వంగపల్లి నారాయణరావు పర్యవేక్షణలో చేపట్టిన నిర్మాణాలతో ప్రారంభమైన ఆ ప్రాంగణం, నేడు ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలుగా విస్తరించి, చుట్టుపక్కల వందలాది పల్లెల నుంచి వచ్చే పేద, మధ్యతరగతి విద్యార్థులకు నిరంతర జ్ఞాన ద్వారాలను తెరిచి ఉంచింది.? 'విద్యా దానం మహాదానం' అన్న భారతీయ సనాతన సంస్కృతిలోని ఉన్నతమైన సూక్తికి రాధాబాయమ్మ జీవితం, ఆమె చేసిన త్యాగం నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తాయి. భవనాలు కాలక్రమంలో శిథిలమవ్వవచ్చు, గోడలు కూలి కొత్త నిర్మాణాలు వెలయవచ్చు, తరాలు మారవచ్చు; కానీ విద్యార్థుల భవిష్యత్తు కోసం సమర్పించిన ఆ పుణ్యభూమి మాత్రం తరతరాలకు అక్షర సంపదను పంచుతూ నిరంతరం చిరంజీవిగా నిలుస్తుంది. ఆ విద్యా ప్రాంగణంలో అక్షరాభ్యాసం చేసి, విద్యా కుసుమాలుగా వికసించిన ఎందరో పూర్వ విద్యార్థులు సమాజంలో ఉన్నతోన్నత స్థానాలకు చేరుకున్నారు. ఈ చదువుల తల్లి ఒడిలో ఎదిగిన బిడ్డలు నేడు లబ్ధప్రతిష్ఠులైన వైద్యులుగా, శాస్త్రవేత్తలుగా, న్యాయ కోవిదులుగా, సమర్థవంతమైన పరిపాలనాధికారులుగా, విద్యావేత్తలుగా, వ్యాపార దిగ్గజాలుగా, ప్రజాప్రతినిధులుగా దేశవిదేశాల్లో తమదైన ముద్ర వేస్తూ సమాజానికి సేవలందిస్తున్నారు. ఒక విద్యాసంస్థ నిజమైన గెలుపును కేవలం సువిశాలమైన తరగతి గదులతోనో, విద్యార్థుల సంఖ్యతోనో కొలవలేం; ఆ ప్రాంగణం నుంచి రూపుదిద్దుకుని సమాజ పురోగతికి ఊతమిచ్చిన ఉత్తమ పౌరుల విజయాలే ఆ సంస్థ వైభవానికి అసలైన కొలమానం. ఆ దృష్టితో ఆలోచిస్తే, వేలాది మంది జీవితాల్లో విజ్ఞాన దీపాలు వెలిగించిన రాధాబాయమ్మ చూపిన దాతృత్వం అత్యంత విశిష్టమైనది, అజరామరమైనది. ఈ మహోన్నత చరిత్రను స్మరించుకుంటూ, సదరు విద్యాసంస్థలు కొనసాగుతున్న విశాల ప్రాంగణానికి 'మధ్వాచారి రాధాబాయమ్మ ప్రభుత్వ విద్యా సంస్థల ప్రాంగణం'గా నామకరణం చేయాలని ధర్మపురి మున్సిపల్ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించడం స్థానిక చరిత్రలో ఒక అద్భుతమైన, చారిత్రాత్మకమైన మైలురాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి అధ్యక్షతన సమావేశమైన పాలకవర్గం ఈ మహత్తర నిర్ణయాన్ని తీసుకుని, ఆ తీర్మానాన్ని అమలు పరిచేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించింది. తమ ప్రాంత మూలాలను, సమాజానికి నిస్వార్థంగా సేవలందించిన దాతలను స్మరించు కోవడంలో ప్రజాప్రతినిధులు చూపిన ఈ చొరవ అభినందనీయం. నామకరణం చేయడం అంటే కేవలం ఒక ప్రవేశ ద్వారం వద్ద లేదా శిలాఫలకంపై అక్షరాలు చెక్కడం మాత్రమే కాదు; అది ఆ ప్రాంతం తన గతాన్ని సగౌరవంగా నెమరు వేసుకుంటూ, నాటి త్యాగధనుల ఆదర్శాలను నేటి యువతరానికి, రేపటి భావితరాలకు సగర్వంగా చాటిచెప్పే సాంస్కృతిక కర్తవ్యం. ఆ విద్యా ప్రాంగణంలోకి అడుగుపెట్టే ప్రతి విద్యార్థికి, సంపదకు అసలైన సార్థకత సమాజ హితం కోసం పాటుపడటంలోనే ఉందని ఆ పేరు నిరంతరం స్ఫూర్తిని రగిలిస్తుంది. ఇటీవల జరిగిన ధర్మపురి మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 15 వార్డు స్థానాలను కాంగ్రెస్ గెలుచుకోగా, వేముల నాగలక్ష్మి రాజేష్ చైర్ పర్సన్‌గా, ఇందారపు రామయ్య ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సంగన భట్ల దినేష్ ప్రస్తుతం జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా పని చేస్తున్నారు...ధర్మపురి మండల స్వస్థలమైన తిమ్మాపూర్ గ్రామానికి చెందిన జువ్వాడి నర్సింగ రావు రాష్ట్ర వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ గా ఉన్నారు. ప్రస్తుతం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ధర్మపురి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధులు తదితర సంక్షేమ శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇలాంటి సందర్భంలో విద్యా ప్రాంగణానికి స్థలదాత పేరును పెట్టాలన్న ప్రతిపాదనకు ప్రభుత్వ స్థాయిలో సానుకూల స్పందన లభిస్తే, అది ధర్మపురి ప్రజల చిరకాల ఆకాంక్షకు గౌరవప్రదమైన పరిష్కారంగా నిలుస్తుంది. ప్రభుత్వ విద్యాశాఖ, ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థుల సంఘాలు సమష్టిగా సమన్వయం చేసుకుని ఈ నామకరణ ప్రక్రియను త్వరితగతిన అధికారికంగా పూర్తి చేయాల్సిన బాధ్యత ఉంది. కళాశాల ప్రధాన ద్వారం వద్ద రాధాబాయమ్మ సేవా నిరతిని, ఆమె విద్యాభివృద్ధికి అందించిన తోడ్పాటును స్పష్టంగా వివరించేలా ఒక శాశ్వత శిలాఫలకాన్ని ప్రతిష్ఠించడం సమంజసమైన కార్యం. అదేవిధంగా, ఆరు దశాబ్దాల క్రితం ఆమె చేసిన ఆరు ఎకరాల తొమ్మిది గుంటల భూదానానికి సంబంధించిన పాత దస్తావేజులు, చారిత్రక రికార్డులు, నాటి నిర్మాణ వివరాలను పకడ్బందీగా సేకరించి, భద్రపరిచి విద్యాసంస్థ ప్రాంగణంలో ప్రత్యేక ప్రదర్శనగా నిలపడం ద్వారా ధర్మపురి ప్రాచీన విద్యా వైభవం భావితరాలకు సజీవ సాక్ష్యంగా నిలుస్తుంది. భూమిని సంపాదించే వారు లోకంలో ఎందరో ఉంటారు, కానీ సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దడానికి సమస్తాన్ని త్యాగం చేసే మహానుభావులు అరుదుగా ఉంటారు. మధ్వాచారి రాధాబాయమ్మ నాటిన ఆ విద్యా విత్తనం నేడు మహా వృక్షమై వేలాది మందికి జ్ఞాన నీడను అందిస్తున్న వేళ, ఆ ప్రాంగణానికి ఆమె పేరును శాశ్వతంగా అంకితం చేయడం ఆ పుణ్యమూర్తికి యావత్ సమాజం సమర్పించే అత్యంత గౌరవప్రదమైన, సమగ్రమైన కృతజ్ఞతా నివాళి.

## పాఠశాలల బచావో ఆందోళన బలోపేతం




న్యూఢిల్లీ: గత ఏడాది ప్రారంభమైన పాఠశాలల బచావో ఆందోళనను ఎస్ఎఫ్ఐ మరింత బలోపేతం చేయనుంది. ఈ ఆందోళనలో భాగంగా, అన్ని రాష్ట్రాల్లోని పాఠశాలలను సందర్శించి నివేదికలు తయారు చేస్తామని ఎస్ఎఫ్ఐ నేతలు ప్రకటించారు. శుక్రవారం నాడిక్కడ హరి కిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య, ఉపాధ్యక్షుడు సుభాష్ జాఖర్, కేంద్ర కమిటీ సభ్యులు సూరజ్ ఇలామన్, కాంతి కుమారి, ఢిల్లీ రాష్ట్ర అధ్యక్షురాలు నాడియా మాట్లాడారు. పాఠశాలల మూసివేత, విలీనాల కారణంగా చదువులకు ఆటంకం కలిగిన విద్యార్థులను గుర్తించి, వారిని సంఘటితం చేస్తామని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి, మూసివేసిన పాఠశాలలను తిరిగి తెరవడానికి స్థానికులను భాగస్వాములను చేస్తూ ఆందోళనలు చేపడతామని అన్నారు. ఈ ఆందోళనలో భాగంగా పది కోట్ల సంతకాలు సేకరిస్తామని, పాఠశాలల దుస్థితికి సంబంధించి బ్లాక్, సబ్-డివిజన్, జిల్లా స్థాయి కార్యాలయాలకు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో సమావేశాలు,

సభలు, రాజ్‌భవన్ మార్చ్‌లు నిర్వహిస్తామని, అక్షరాస్యతా దినోత్సవమైన సెప్టెంబర్ 8న ఢిల్లీలో తొలి సమావేశం నిర్వహిస్తామని అన్నారు. "ప్రభుత్వ విద్యా వ్యవస్థకు మరిన్ని నిధులు కేటాయించడం, జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయడం, మూసివేసిన అన్ని ప్రభుత్వ పాఠశాలలను తిరిగి తెరవడం, 1:20 నిష్పత్తిలో ఉపాధ్యాయులను నియమించడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, బడి మానేసే వారిని నివారించడానికి చర్యలు తీసుకోవడం" వంటివి తమ ప్రధాన డిమాండ్లని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ ప్రచురణ 'స్టూడెంట్స్ స్ట్రగుల్' ప్రత్యేక సంచికను కూడా విడుదల చేశారు.

## భారతావని కీర్తి కిరీటం చంద్రయాన్




భారతదేశం శాస్త్రసాంకేతిక రంగంలో సాధించిన విజయాలలో అంతరిక్ష పరిశోధనకు ఒక ప్రత్యేక గౌరవ స్థానం ఉంది. ప్రపంచం లోని అగ్రరాజ్యాల సరసన నిలబడి, స్వంత ఉపగ్రహాలను ప్రయోగించి, చంద్రుడి వైపు దూసుకెళ్లిన భారత్, ఒక అపూర్వ ఘట్టాన్ని సృష్టించింది. ఆ రోజు చంద్రయాన్-3 విజయవంతంగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగింది. ఇది భారత అంతరిక్ష పరిశోధన చరిత్రలో మాత్రమే కాకుండా, ప్రపంచ అంతరిక్ష చరిత్రలోనూ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిన ఘనత. ఈ సంఘటనకు గుర్తుగా భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం "జాతీయ అంతరిక్ష దినోత్సవం" గా జరుపుకోవాలని నిర్ణయించింది. భారత అంతరిక్ష పరిశోధన ప్రయాణం 1962లో విక్రమ్ సారాభాయ్ దూరదృష్టితో ప్రారంభమైంది. 1975లో తొలి ఉపగ్రహం ఆర్యభటను కక్ష్యలో ప్రవేశపెట్టడం ద్వారా భారత్ అంతరిక్ష శాస్త్రంలో తన అడుగులు వేసింది. అప్పటి నుంచి ఇస్రో (మొఖీూ) వందలాది ఉపగ్రహాలను ప్రయోగిస్తూ వాతావరణ అంచనాలు, టెలి కమ్యూనికేషన్, రిమోట్ సెన్సింగ్, వ్యవసాయం, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో అపారమైన సహకారం అందిస్తోంది. 2013లో మంగళ యాన్ మిషన్ విజయంతో అమెరికా,రష్యా, యూరప్ తరువాత మంగళ గ్రహాన్ని చేరుకున్న నాలుగో దేశంగా భారత్ నిలిచింది. ఈ మిషన్ కేవలం 450 కోట్ల రూపాయల వ్యయంతో పూర్తయి, ప్రపంచాన్ని ఆశ్చర్య పరిచింది.

## సోమాలియా, యెమెన్ తీరాల్లో కార్గో నౌకల హైజాక్



న్యూఢిల్లీ : సోమాలియా, యెమెన్ తీరాల్లో వేర్వేరు ఘటనల్లో రెండు కార్గో నౌకలు హైజాక్ అయ్యాయి. ఈ ఘటనల్లో మొత్తం 22 మంది భారతీయులు ఉన్నట్లు షిప్పింగ్ మంత్రిత్వ శాఖకు చెందిన ఒక సీనియర్ అధికారి శుక్రవారం తెలిపారు. అధికారిక వివరాల ప్రకారం.. ఎరిట్రియా జెండా కలిగిన 'ఎం టి సిబు 1' అనే చమురు ఉత్పత్తుల ట్యాంకర్‌ను ఆగస్టు 20న యెమెన్ తీరానికి సుమారు 30 నాటికల్ మైళ్ల దూరంలో ఉన్న ఏడెన్ గల్ఫ్‌లో సాయుధ సముద్రపు దొంగలు హైజాక్ చేశారు. ఈ నౌకలో 16 మంది భారతీయులు, ఒక సిరియా జాతీయుడు, ఒక సూడాన్ జాతీయుడు, ఒక ఇరాక్ జాతీయుడు, మరొక గుర్తింపు లేని నావికుడు సహా మొత్తం 20 మంది సిబ్బంది ఉన్నారు. ప్రస్తుతం ఆరుగురు సాయుధ సముద్రపు దొంగలు నౌకలో ఉన్నారని, దానిని తమ నియంత్రణలోకి తీసుకున్నారని అధికారులు తెలిపారు. అలాగే తుర్కియే నుంచి సోమాలియా రాజధాని మొగడిషూకు వెళ్తున్న 'లుటుఫ్' అనే కార్గో నౌకను సముద్రపు దొంగలు హైజాక్ చేశారు. కామెరూన్ పతాకంతో ప్రయాణిస్తున్న ఈ నౌకలో మొత్తం 10 మంది సిబ్బంది ఉండగా, వారిలో ఆరుగురు భారతీయులు, మిగిలిన వారు తుర్కియే, జార్జియా, సెర్బియా దేశాలకు చెందినవారు ఉన్నారు. సోమాలియా తీరంలో సుమారు ఎనిమిది మంది దొంగలు ఈ నౌకను తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. నౌక వద్దకు ఓ చిన్న పడవ వచ్చి వెళ్లిన తర్వాత ఆ ప్రాంతంలో వైమానిక దాడి జరిగిందని, అయితే ఆ దాడి ఎవరు చేశారనే దానిపై స్పష్టత రావాల్సి ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

# వినాయక నిమజ్జనోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

## - శోభాయాత్ర మార్గాన్ని పరిశీలించిన కలెక్టర్, సీపీ

## - ప్రమాదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని అధికారులకు ఆదేశం

**నిజామాబాద్, సెప్టెంబర్ 19 ( ప్రజాగళం ప్రతినిధి)** ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాల నడుమ గణేష్ నిమజ్జనోత్సవం జరుపుకోవాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య, ఇతర అధికారులతో కలిసి ప్రత్యేక బస్సులో కలెక్టర్ శనివారం గణేష్ శోభాయాత్ర కొనసాగే మార్గాలను పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతం నుండి శోభాయాత్ర ప్రారంభం కానుండగా, భారీ విగ్రహాలను నిమజ్జనం చేసే యంచ శివారులోని గోదావరి బ్రిడ్జి వరకు గల మార్గాన్ని, నందిపేట మండలం ఉమ్మెడ గోదావరి పరీవాహక ప్రాంతాన్ని, ఆర్మూర్ లోని గుండ్ల చెరువును కలెక్టర్, సీ.పీ నిశితంగా పరిశీలన జరిపారు. అక్కడక్కడా గుంతలు పడిన రోడ్లను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శోభాయాత్రకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా రోడ్లకు ఇరువైపులా అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను పైకి భిగించాలని సూచించారు. జానకంపేట్ రైల్వే క్రాసింగ్ మీదుగా ఎనిమిది అడుగులకు పైబడి ఎత్తు కలిగిన విగ్రహాలను తరలించే వీలు లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గంగా నందిపేట మండలంలోని ఉమ్మెడ గోదావరి బ్రిడ్జి వద్ద భారీ విగ్రహాలను నిమజ్జనం చేయాలని సూచించారు. యంచ గోదావరి బ్రిడ్జి తో పాటు, ఉమ్మెడ వద్ద భారీ విగ్రహాల నిమజ్జనం కోసం సరిపడా క్రేన్లను అందుబాటులో ఉంచాలని, తగిన లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని, జనరేటర్, అంబులెన్సు, మెడికల్ క్యాంపు లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిమజ్జనోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగానే భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. కాగా, నిజామాబాద్ నగరంలో శోభాయాత్ర కొనసాగే దుబ్బా ప్రాంతం నుండి వినాయకుల బావి వరకు గల ప్రాంతాలను సైతం కలెక్టర్, సీ.పీలు సందర్శించారు. వినాయక బావి వద్ద సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులతో కలిసి నిమ్మజన ఏర్పాట్ల విషయమై కలెక్టర్, సీ.పీ సమాలోచనలు జరిపారు. వినాయక నిమజ్జన శోభాయాత్రకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. ప్రధానంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా, నీటిలో మునిగి గల్లంతు కావడం, రోడ్డు ప్రమాదాలకు గురి కావడం వంటి ఘటనలు ఎక్కువగా జరిగేందుకు ఆస్కారం ఉన్నందున అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పోలీస్, ఫైర్, ఆర్ అండ్ బీ, ట్రాన్స్కో, పంచాయతీరాజ్, ఫిషరీస్, రెవెన్యూ తదితర శాఖలన్నీ సమన్వయంతో పని చేస్తున్నాయని తెలిపారు.



జానకంపేట్ రైల్వే క్రాసింగ్ వద్ద హై వోల్టేజ్ విద్యుత్ లైన్ ఉన్నందున ఎనిమిది అడుగుల కంటే ఎక్కువ ఎత్తు కలిగిన భారీ విగ్రహాలను ప్రత్యామ్నాయ మార్గం ద్వారా నిమజ్జనానికి ఉమ్మెడ గోదావరికి తరలించాలని సూచించారు. ఈ మేరకు ఉమ్మెడ వద్ద కూడా నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. పోలీసులతో సమన్వయం చేసుకుని, వారి సూచనలు పాటిస్తూ, నిర్దేశించిన మార్గం మీదుగా శోభాయాత్ర జరపాలని గణేష్ మండపాల నిర్వాహకులను కలెక్టర్ కోరారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఏసీపీలు ప్రకాష్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, మస్తాన్ అలీ, మున్సిపల్, ఆర్ అండ్ బీ, అగ్నిమాపక, ఫిషరీస్, పంచాయతీరాజ్, రెవెన్యూ, రవాణా, విద్యుత్, వైద్యారోగ్య తదితర శాఖల అధికారులు ఉన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు

## నిజాయితీ చాటుకున్న 108 సిబ్బంది....



**ఎడపల్లి,సెప్టెంబర్ 19: (ప్రజా గళం)** ఎడపల్లి మండల కేంద్రంలో కొత్త బస్టాండ్ వద్ద శనివా రం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వృద్ధురా లు తీవ్రంగా గాయపడింది.స్థానికుల కథనం ప్రకారం.. ఎడపల్లి మండలం మంగల్ పహాడ్ గ్రామానికి చెందిన భూమవ్వ కొత్త బస్టాండ్ ప్రాంతంలో నడుచుకుంటూ వెళ్తుండగా అతివేగంగా వచ్చిన బైక్"ఢీ"కొట్టడంతో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది.అక్కడే ఉన్న ఎడపల్లి 108 సిబ్బంది ఈఎంటి లక్ష్మణ్,పైలెట్ నరేష్ లు ప్రమాదాన్ని గమనించి భూమవ్వ కు ప్రథమ చికిత్స చేసి నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.భూమవ్వ వద్ద లభించిన బంగారు మంగళ సూత్రం అలాగే డబ్బులు,ఫోన్ అతని కుమా రుడు గంగాధర్ కు అప్పగించి తమ నిజాయితీని చాటుకున్నారు.


# సీఎం ఇలాఖాలో కాంగ్రెస్ పై కల్వకుంట్ల కవిత పాంచజన్య శంఖారావం

## - ఘనంగా ఏర్పాట్లు చేసిన పార్టీ నాయకులు

## - కొడంగల్ నుంచి కోస్గి వరకు భారీ ర్యాలీ

**నిజామాబాద్ సెప్టెంబర్ 19 (ప్రజా గళం ప్రతినిధి)**సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తోన్న కొడంగల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పాంచజన్య శంఖారావం పూరించనున్నారు. కొడంగల్ నియోజవకర్గంలోని కోస్గి కాలేజీ గ్రౌండ్ లో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే పాంచజన్య సంకల్ప సభకు పార్టీ నాయకులు ఘనంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. 120 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పుతో భారీ సభా వేదిక ఏర్పాటు చేశారు. వంద మందికి పైగా ముఖ్య నాయకులు సభ వేదిక మీద కూర్చోనున్నారు. సభా ప్రాంగణంలో 10 వేల మంది ప్రజలు కూర్చొనేలా సీటింగ్ ఏర్పాటు చేశారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత మొదటి సారి కొడంగల్ కు వస్తున్న పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవితకు ఘన స్వాగతం పలికేలా పార్టీ నాయకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కొడంగల్ నుంచి కోస్గి కాలేజీ గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. కోస్గి పట్టణంలో పార్టీ జెండాను ఆవిష్కరించిన తర్వాత కవిత నేరుగా కాలేజీ గ్రౌండ్ కు చేరుకుంటారు.హైదరాబాద్ శివారుల్లోని అప్పా జంక్షన్ వద్దకు కల్వకుంట్ల కవితకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నాయకులు ఘన స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి ర్యాలీగా మొయినాబాద్, చేవెళ్ల, మన్నెగూడ, పరిగి మీదుగా కవిత కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రారంభమయ్యే గడ సింగాపూర్ కు చేరుకుంటారు.. అక్కడ స్వాగతం పలికి అనంతరం కొడంగల్ కు చేరుకుంటారు.. కొడంగల్ నుంచి భారీ ర్యాలీగా కోస్గి కాలేజీ గ్రౌండ్ కు చేరుకుంటారు. కొడంగల్ కు వస్తున్న కవితకు ఘన స్వాగతం పలికేలా దారి పొడవునా పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కవిత కోస్గి సభ వేదిక పై నుంచి పాంచజన్య శంఖారావం పూరించనున్నారు. రాజకీయ పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత జోగులాంబ తల్లి ఆశీస్సులతో పాలమూరు గడ్డపైనే మొదట అడుగు పెట్టిన కవిత.. ఇప్పుడు రెండోసారి అత్యంత కీలకమైన సంకల్పం తీసుకోవడానికి పాలమూరు గడ్డనే ఎంచుకున్నారు. మే 8న షాద్ నగర్ సమీపంలోని చౌదరిగూడెం వద్ద పాలమూరు -- రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభ నిర్వహించి అప్పటి వరకు మొద్దు నిద్రలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తట్టి లేపిన కల్వకుంట్ల కవిత.. ఆదివారం కోస్గి సభ వేదిక పై నుంచి సబ్బండ వర్గాలు సకల జనుల అభివృద్ధి, సాధికారతతో కూడిన బహుజన తెలంగాణ సాధన కోసం తాను తీసుకోబోయే నిర్ణయాలను ప్రకటించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు ఎలా వంచనకు గురవుతున్నారు.. కృష్ణా జలాల దోపిడీని ఏపీ ప్రభుత్వం ఎంత యథేచ్ఛగా సాగిస్తున్న విషయాన్ని ప్రజలకు వివరించనున్నారు.

**స్వరాష్ట్రాన్ని పరిరక్షించే స్వీయ రాజకీయ శక్తి.**



దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పరిరక్షించుకునేందుకు స్వీయ రాజకీయ శక్తి ఎందుకు అవసరమో కవిత వివరించనున్నారు. రెండు జాతీయ పార్టీలు ఢిల్లీకి గులాం గిరి చేస్తూ తెలంగాణ ప్రయోజనాలను ఎలా పణంగా పెడుతున్నాయో వివరించనున్నారు. తెలంగాణ సాధన కోసం ఏర్పడిన పార్టీ రాజకీయ పార్టీ సైతం రెండు జాతీయ పార్టీల దారిలోకి వెళ్లడంతో ఫక్తు తెలంగాణ ప్రయోజనాల కోసం గొంతు విప్పే పార్టీ లేకపోవడంతో కవిత తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వ పతాకగా తెలంగాణ రక్షణ సేన ఏర్పాటు చేశారు. తెలంగాణ మదర్ బోర్డుగా పని చేసే తమ పార్టీని ఆదరించాలని కోస్గి వేదిక మీది నుంచి ప్రజలను అభ్యర్థించనున్నారు. తమకు అవకాశం ఇస్తే బహుజన తెలంగాణాగా మన రాష్ట్రాన్ని ఎలా సుసంపన్నం చేస్తారో వివరించనున్నారు.

# ఎడపల్లి మున్నూరు కాపు సంఘంలో భక్తితో మొక్కు లు అందుకుంటున్న గణనాథుడు....

## పతిరోజు భక్తులకు అన్న ప్రసాద వితరణ...




**ఎడపల్లి,సెప్టెంబర్ 19: (ప్రజా గళం)**ఎడపల్లి మండల కేంద్రంలోనీ స్థానిక మున్నూరు కాపు సంఘంలో ప్రతిష్టించిన గణనాథుడు భక్తి శ్రద్దలతో భక్తుల చే ఘనమైన పూజలు అందుకుంటున్నాడు. మున్నూరు కాపు సంఘంలో సాయి సేవ గణేష్ మం డలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలు ప్రతిరోజు భక్తులకు ఉత్సాహన్ని నింపుతున్నాయి. గణపయ్యకు భక్తితో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పురోహితులు సాంబశివ మహారాజ్ గణనాథుడికి మంత్రోచ్చారణాలతో భక్తులచే ప్రత్యేక పూజలు నిర్వహిస్తు న్నారు. మున్నూరు కాపు కుల సంఘంలో మొట్ట మొదటిసారిగా గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసి గణేష్ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ప్రతి రోజు భక్తులకు సాయి సేవ గణేష్ మండలి వద్ద అన్నప్రసాద వితరణ చేపడుతున్నారు.

# ఎడపల్లి పిహెచ్ సిని ఆకస్మిక తనిఖీ చేసిన నిజామాబా ద్ అసిస్టెంట్ కలెక్టర్ సురేష్....

## - వైద్యు,సిబ్బంది రోగులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలి.... కలెక్టర్ ఆదేశం....

**ఎడపల్లి,సెప్టెంబర్ 19:(ప్రజా గళం)**నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రభు త్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్ర ఆసుపత్రిని శనివారం నిజామాబాద్ అసిస్టెంట్ కలెక్టర్ సురేష్(ఐఏఎస్)ఆక స్మికంగా తనిఖీ చేశారు.ఆసుపత్రిలోని ఓపి,ఐపీ గురిం చి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.అలాగే ఫార్మసీ డిస్పెన్సింగ్ విభాగం,ఫార్మసీ ప్రధాన విభాగాల ను సందర్శించి,గడువు ముగిసే మందులు ఏమైనా ఉన్నా యని సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. మందుల వాడకం ముగింపు(ఎక్స్ ఫెయిర్)తేదిని తెలియజేయా లని ఫార్మసిస్ట్ ను అసిస్టెంట్ కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలోని ఓపి రూమ్,ఐపీ వార్డులు,ల్యాబ్, బిఎమ్ డబ్ల్యూ,వాష్ రూమ్ తదితర విభాగల ను అయన తనిఖీ చేశారు.ఆపరేషన్,అటెండెన్స్ రిజిస్టర్ ను సందర్శించారు.రోగులకు అందుతున్న వైద్య సదుపా యాల గురించి అయన సూపర్ వైజార్లతో,సిబ్బందితో అయన చర్చించారు.నిన్నటి విధులు,ఇంటి సందర్శనల సంఖ్య,ఎఎన్సి / పిఎన్సి ఫోన్ కాల్స్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రిలో వైద్యులు,సిబ్బం ది అందిస్తున్న వైద్య సేవలను,వారి పని తీరుగురించి రోగులను అడిగి విషయాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ పిహెచ్ సి/మండలం/గ్రామ ప్రొఫైల్ గురించి విచారిం చారు.ఆశా పర్ఫార్మెన్స్ అలాగే టైమింగ్స్,ఆశా వర్కర్స్ హాజరు రిజిస్టర్లును పరిశీలించారు.ఎన్ సిడి సేవల గురించి జ్వర సర్వేలో కవర్ చేయబడిన సిబ్బంది వివరాలు, సమయపాలన, విధులు,గ్రామ పంచాయ తీల గురించి అడిగి తెలుసు కున్నారు.అంతేకాకుండా ఎల్ ఎంపి,అర్హత కలిగిన జంటలు,చేతిలో ఉన్న ఎఎన్ సి/పిఎన్ సి కేసుల సంఖ్య తదితర అంశాలపై వైద్యులు,సిబ్బందితో అయ న చర్చించారు.రోగులకు అందుబాటులో





ఉంటూ, ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చే రోగుల పట్ల ప్రేమగా ఉ ండాలని,వారికీ మంచి వైద్యం అందించాలని అసిస్టెంట్ కలెక్టర్ సురేష్ వైద్యుల ను, సిబ్బందిని ఆదేశించారు.కలెక్టర్ వెంట మండల వైద్యాధికారి డాక్టర్.వినీత్ కుమార్ రెడ్డి,స్టాప్ నర్సు విజయం వనిత,సరిత,ఫార్మసిస్ట్ సంపత్ లక్ష్మి,సూపర్ వైజార్లు దేవేందర్, జీవమ్మ,పావని,భారతి,ల్యాబ్ టెక్నీ షియాన్ కృష్ణ మోహన్,ఎఎన్ఎంలు సిబ్బంది ఉన్నారు.

# అటెండరా...మజాకా!

## - అట్రాసిటీ కేసుల పేరుతో అధికారులకు బెదిలింపులు

**నిజామాబాద్ సెప్టెంబర్ 19 (ప్రజాగళం ప్రతినిధి )** జిల్లా గ్రంథాలయంలో అటెండర్ గా విధులు నిర్వర్తిస్తున్న ఓ ఉద్యోగి పై స్థాయి అధికారులను బెదిరిస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. ఏకంగా అనధికారికంగా ఆరు నెలలు విధులకు హాజరు కాకపోయినా అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీనిపై ప్రశ్నించిన పై స్థాయి అధికారిని అట్రాసిటీ కేసు పెడతానంటూ బెదిరించడంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.ప్రభుత్వ కార్యాలయంలో విధులు నిర్వర్తించాల్సిన ఒక అటెండర్ పై స్థాయి అధికారులకే చుక్కలు చూపిస్తున్న వైనం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఏకధాటిగా విధులకు ఎగనామం పూర్తి వేతనం ఇవ్వాలంటూ, అధికారులపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పేరుతో బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.నిబంధనల ప్రకారం ఆఫీసులో ఉండాల్సిన సదరు వ్యక్తి ,ఆఫీసర్లు వాడే కార్లలో షికార్లు చేస్తూ అధికారులను శాసిస్తున్నాడని సమాచారం.విధి నిర్వహణలో నిలదీయాల్సిన ఉన్నతాధికారులు సైతం ఆయన బెదిరింపులకు భయపడి మిన్నకుండిపోతున్నట్లు తెలుస్తోంది.ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తూ, అధికారులను మానసిక క్షోభకు గురిచేస్తున్న ఈ అటెండర్ పై తక్షణమే శాఖాపరమైన విచారణ జరిపి, సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రంథాలయంలోని ఓ అధికారి కోరుతున్నారు. ఆ కార్యాలయంలో అటెండర్ ఆడింది ఆట పాడింది పాటగా సాగుతుంది. గ్రంథాలయానికి




వచ్చే పాఠకులకు సైతం ఎలాంటి తనదైన శైలిలో సహాయ సహకారాలు అందించకుండా విధులకు దుమ్మా కొడుతున్నట్లు తెలుస్తుంది. తనను ప్రశ్నించిన వారిపై ఎదురు తిరిగి కేసు నమోదు చేయిస్తానంటూ బెదిరించడం ఈ విషయాన్ని అధికారి బహిర్గతం చేయడం ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది. అటెండర్ బెదిరింపులపై ఆందోళనకు గురైన సదరు అధికారి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. అతని వేధింపులు తాళలేకపోతున్నామని, తక్షణమే అటెండర్ పై చర్యలు తీసుకోవాలని అధికారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఐ.డీ.ఓ.సీలో వినాయకునికి ప్రత్యేక పూజలు

## - పాల్గొన్న కలెక్టర్, సీపీ.

**నిజామాబాద్, సెప్టెంబర్ 19 ( ప్రజాగళం ప్రతినిధి)** వినాయక చవితి వేడుకల్లో భాగంగా నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ప్రాంగణం(కలెక్టరేట్)లో ప్రతిష్టించిన వినాయకుడికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టర్ భవేష్ మిశ్రా, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు గణనాథుడిని దర్శించుకుని అన్న ప్రసాద వితరణలో పాల్గొన్నారు. ట్రేసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ్ రెడ్డి అన్న ప్రసాద వితరణ గావించగా, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్ సహకారం అందించారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, ఆర్డీఓ



రాజేంద్ర కుమార్, కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ప్రశాంత్, భాస్కర్, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఎడపల్లి గ్రామంలో పలు గణేష్ మండపాల వద్ద కొలు వైనా గణనాథులు భక్తులచే భక్తితో ఘనమైన పూజలు అందుకుంటున్నాయి....

## - ప్రతిరోజు భక్తులకు అన్నప్రసా ద వితరణ...పెద్ద సంఖ్యలో అన్నప్రసాదం స్వికరణకు తరలివస్తున్న భక్తులు....

**ఎడపల్లి,సెప్టెంబర్ 19: (ప్రజా గళం)**ఎడపల్లి మండల కేంద్రంలో వివిధ గణేష్ మండపాల వద్ద కొలువైన గణనాథులు భక్తుల చే ఘనమైన పూజ లు అందుకుంటున్నాయి.భక్తి శ్రద్దలతో భక్తులు ప్రతి నిత్యం గణ నాయకులకు ప్రత్యేక పూజలు నిర్వ హిస్తున్నారు.అత్యంత వైభవంగా,కనుల పండు వగా భక్తి శ్రద్దలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతు న్నాయి.గణేష్ మండలిల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలు ప్రతిరోజు భక్తులకు ఉత్సాహన్ని నింపుతున్నాయి. గణపయ్యకు భక్తితో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు .పురోహితుల వేద మంత్రోచ్చారణాలతో భక్తుల చే ప్రత్యేక పూజలు నిర్వ హిస్తున్నారు.గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజు మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానం కార్యక్రమాలు చేపడుతున్నారు.గణేష్ మండపాల వద్ద అన్న ప్రసాదం స్వికరణకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి భక్తితో అన్న ప్రసాదం స్వికరించి వెళుతున్నారు. గణేష్ మండపాలకు అలాగే గణపయ్య లకు పలు రకాల లైట్లు,డెకోరేషన్



లతో భక్తులను ఆకట్టుకుంటు న్నాయి. అందంగా అలకరించిన గణేష్ మండపాల వద్ద కు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి గణ నాథులకు భక్తి శ్రద్దలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కు లు చెల్లించు కుంటున్నారు. ఎక్కడ చుసిన గణేష్ మండపాల వద్ద భక్తులతో సందడిగా మారుతున్నాయి.

# అధిష్టానం ఆదేశిస్తే పోటీ చేస్తా

**- తండ్రి బాటలోనే ప్రజల కోసం నిరంతర సేవ- ఆలూర్ గంగారెడ్డి కుమార్తె విజయభారతి - ఘనంగా ఆలూర్ గంగారెడ్డి 4వ వర్ధంతి వేడుకలు**



**ఆలూర్,సెప్టెంబర్:19 (ప్రజా గళం )**అధిష్టానం ఆదేశిస్తే బిఆర్ఎస్ పార్టీ నుండి ఆర్మూర్ నియోజకవర్గంలో పోటీ చేస్తానని విజయభారతి స్పష్టం చేశారు. శనివారం ఆలూర్ మండల కేంద్రంలో ఆలూరు గంగారెడ్డి 4వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన స్వగ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో గంగారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు నేతలు ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళులు అర్పించారు నివాళులు.సమాజానికి, రైతాంగానికి ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలూర్ గంగారెడ్డి కుమార్తె విజయభారతి, మాట్లాడుతూ.తన తండ్రి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే జీవిత లక్ష్యమని స్పష్టం చేశారు.సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చి రైతుల సమస్యలపె ,ఎర్రజొన్న ఉద్యమంలో తెలంగాణ మలిదశ సాధన పోరాటంలో కేసీఆర్‌తో కలిసి ఆయన చురుగ్గా పాల్గొన్నారని గుర్తుచేశారు. ఇంజనీరింగ్‌తో పాటు న్యాయవిద్య పూర్తి చేసిన తాను చట్టపరంగా, సామాజికంగా ప్రజలకు,ముఖ్యంగా రైతులు,మహిళలు,నిరుపేదలకు అండగా నిలబడతానని అన్నారు.ఏజీఆర్ ఆలూర్ గంగారెడ్డి ఫౌండేషన్ ట్రస్ట్ ను మరింత బలోపేతం చేస్తామన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రైతులకు, నిరుపేదలకు తక్షణ సాయం ట్రస్టు ద్వారా చేస్తామన్నారు. మహిళల సాధికారతకు పూర్తి స్థాయిలో సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు.నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పోరాడతానని వెల్లడించారు.ప్రముఖ నేత అరవింద్ శర్మ మాట్లాడుతూ.తెలంగాణ ఉద్యమంలోనూ,ప్రాంత అభివృద్ధిలోనూ గంగారెడ్డి అందించిన సేవలు మరవరానివని పేర్కొన్నారు.ఏజీఆర్ ట్రస్ట్ ద్వారా గత నాలుగేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు అందిస్తున్నామని,అందులో భాగంగా గ్రామానికి చెందిన 22 ఏళ్ల క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సహాయం అందించామని తెలిపారు.రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు ,మహిళలకు క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో బార్ల మనీష్,గంగారెడ్డి,మహేందర్,సూర్య రెడ్డి,సవీన్,హరీష్,ఆలూరు గంగారెడ్డి ,పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి, మావిగన్‌కు పెద్ద తేడా లేదా





**విజయవాడ,** : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం, రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ ప్రాజెక్టుల పురోగతిపై ఇటీవల నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన కీలక వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరలేపాయి. అమరావతి అంటే కేవలం 29 గ్రామాల సముదాయం మాత్రమే కాదు.. విజయవాడ, గుంటూరు నగరాలతో అనుసంధానమైన సమగ్ర బృహత్ రాజధాని ప్రాంతం అంటూ చంద్రబాబు ఇచ్చిన స్పష్టత, అమరావతి బ్రాండ్‌ను పునర్నిర్మించే వ్యూహాత్మక అడుగుగా కనిపిస్తోంది. విజయవాడ- గుంటూరు-అమరావతిలను కలిపి ఒక మెగా మెట్రోపాలిటన్ రీజియన్‌గా తీర్చిదిద్దడమే ఏపీ భవిష్యత్ ఆర్థిక, సామాజిక దిశను నిర్దేశించే అసలైన మాస్టర్ ప్లాన్ అని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.ఈ ప్రకటన వెనుక విస్తృతమైన రాజకీయ, నరేటివ్ పోరాటం దాగి ఉంది. గత కొద్దికాలంగా అమరావతి బ్రాండ్ ఇమేజ్‌ను తగ్గించేందుకు ప్రతిపక్ష వైఎస్సార్సీపీ నిరంతరం కౌంటర్ నెరేటివ్‌ను నడుపుతోంది. జగన్ మావిగన్ ప్రతిపాదన తెచ్చారు. మావిగన్‌లో మ అంటే మచిలిపట్నం..మిగతా రెండు విజయవాడ, గుంటూరు. ఇప్పుడు చంద్రబాబు చెప్పిన దాంట్లో మచిలీపట్నం లేదు. మిగతా అంతా సేమ్. మాది విజన్, మీది కేవలం 29 గ్రామాల రియల్ ఎస్టేట్ మోడల్ అని చిత్రీకరించే ప్రయత్నం చేయడం ద్వారా రాజధానిపై ప్రజల్లో గందరగోళం సృష్టించడమే వైఎస్సార్సీపీ ప్రధాన రాజకీయ వ్యూహంగా మారింది. దీనికి చెక్ పెడుతూనే, సాధారణ ప్రజల్లో ఉన్న సంకోచాలను తొలగించేందుకు చంద్రబాబు ఈ త్రివేణీ సంగమం ఫార్ములాను తెరపైకి తెచ్చారు. కేవలం 29 గ్రామాలలోని కోర్ క్యాపిటల్ ఏరియానే రాజధానిగా ప్రచారం కావడం వల్ల రాయలసీమ, ఉత్తరాంధ్ర లేదా పల్నాడు ప్రజల్లో ఇది అందరి రాజధాని కాదు అనే భావన కలిగే ప్రమాదం ఉంది. అందుకే, విజయవాడ, గుంటూరు నగరాల ఆర్థిక వ్యవస్థను, మౌలిక వసతులను అమరావతితో ఐక్యపరిచి, 80 లక్షలకు పైగా జనాభాను కవర్ చేసే ఒక విశ్వనగరంగా డెవలప్ చేస్తామని చెప్పడం ద్వారా ఈ ప్రాజెక్టుకు ప్రాంతీయ ఆమోదాన్ని పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది.రూ.50,999 కోట్ల విలువైన 95 మౌలిక వసతుల ప్రాజెక్టులతో అమరావతిలో పనులు పునఃప్రారంభమైన వేళ, ప్రతినెల కనీసం 7.92 శాతం పురోగతి సాధించాలని చంద్రబాబు క్షేత్రస్థాయి అధికారులకు నిర్దేశించిన గడువు కేవలం నిర్మాణ వేగాన్ని సూచించడమే కాకుండా.. పనులను వేగవంతం చేసి స్పీడ్, క్వాలిటీ, డెలివరీ సూత్రంతో ప్రతిపక్షాల నోళ్లు మూయించాలనే పట్టుదలను ప్రతిబింబిస్తోంది. ప్రతిపక్షాలు ఇది సాధ్యం కాని కల, కేవలం భూముల ప్రకటనలు మాత్రమే అని విమర్శిస్తుండగా, ప్రభుత్వం మాత్రం ఇది అమరావతి విజన్ 2.0 అని గట్టిగా నమ్ముతోంది.మరోవైపు, వైఎస్సార్సీపీ ఈ పరిణామాలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తోంది. జగన్ చెప్పిన మావిగన్ రూట్‌లోకే చంద్రబాబు వస్తున్నారని జగన్ విజనరీ అంటున్నారు. ఇప్పుడు అమరావతి అంటే 29 గ్రామాలు కాదని, విజయవాడ-గుంటూరుతో పాటు మచిలీపట్నాన్ని కూడా కలపాల్సిందే అని వైసీపీ సోషల్ మీడియా విభాగాలు ప్రచారం వేగవంతం చేశాయి. అంటే ఎలా చూసినా అమరావతి, మావిగన్‌కు పెద్ద తేడా లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సీఆర్డీఏ గ్రామీణ పరిధులను, మచిలీపట్నం పోర్ట్ కనెక్టివిటీని తెరపైకి తెస్తూ.. అమరావతి నిర్మాణంలో జాప్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే చంద్రబాబు ఈ కొత్త మెట్రోపాలిటన్ డెఫినిషన్‌ను తెరపైకి తెచ్చారనేది వైసీపీ ప్రధాన ఆరోపణ. రాజధాని అమరావతి ప్రాంతం కేవలం భౌగోళిక నిర్మాణం కాక ఏపీ భవిష్యత్ ఆర్థిక ఇంజిన్ కాబోతుందా లేదా రాజకీయ వివాదాల నిలయంగా మిగిలిపోతుందా అనేది రాబోయే రెండేళ్లలో పనుల పురోగతి , పైనే ఆధారపడి ఉంటుంది.

# బోధన్ నిజాం షుగర్ ఫ్యాక్టరీని వెంటనే పునరుద్ధరించా లి....

**- కార్మిక సంఘాల నాయకులు డిమాండ్.... - కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఫ్యాక్టరి గేట్ ముందు ధర్నా.... - వేతన బకాయిలు చెల్లించి కార్మికులకు న్యాయం చే యాలని కార్మికులు డిమాండ్...**



**బోధన్ ప్రతినిధి,సెప్టెంబర్ 9:(ప్రజా గళం)**నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని నిజాం షుగర్ ఫ్యాక్టరీని వెంటనే పునఃప్రారంభించి,కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలను చెల్లించాలని అర్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.కార్మిక సంఘాల ఆధ్వ ర్యంలో శనివారం ఫ్యాక్టరీ ప్రధాన గేటు ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు నాగుల రవిశంకర్ గౌడ్,ఉపేందర్ మాట్లా డుతూ..ఫ్యాక్టరీ 11 ఏళ్లుగా లే ఆఫ్‌లో ఉండటంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఫ్యాక్టరీ మూతపడటంతో కార్మిక కుటుంబాల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిజాం షుగర్ ఫ్యాక్టరీ ని తెరిపిస్తామని ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి,స్థానిక ఎమ్మెల్యే పొద్దుటూరి. సుదర్శన్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఫ్యాక్టరీ పునరుద్దరించేం దుకు,కార్మికుల సమస్యల పరిష్కారానికి అసెంబ్లీలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శ న్ రెడ్డి సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించి,ఫ్యాక్టరీ పునః ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని కోరారు.వేతన బకాయిలు చెల్లించడంతో పాటు ఫ్యాక్టరీని పునఃప్రారం భించేందుకు ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటిం చాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపో తే అన్ని పార్టీలను కలుపుకుని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు,మున్సిపల్ వైస్ చైర్మన్ ఇలియాజ్,కౌన్సిల ర్లు రఫీక్,సమీర్,కార్మిక సంఘాల నాయకులు బాల కృష్ణ, ఈరవేణి సత్యనారా యణ,కార్మికులు రాంబాబు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏళ్లలో 30 మండలి ఖాళీలు



**గుంటూరు,** : ఆంధ్రప్రదేశ్ రాజకీయం ప్రస్తుతం శాసనమండలి నామినేటెడ్ స్థానాల చుట్టూ తిరుగుతోంది. గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ పదవుల కోసం తెలుగుదేశం పార్టీలో దాదాపు ఇరవై మందికి పైగా సీనియర్ నేతలు తీవ్రంగా పోటీ పడుతుండటం అమరావతి వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే, ప్రస్తుతం ఖాళీ అయిన రెండు స్థానాల కోసమే క్యూలో నిలబడి అసంతృప్తికి లోనుకావాల్సిన అవసరం లేదని, కాస్త ఓపిక పడితే ఆశావహులందరికీ పదవులు దక్కడం ఖాయమని సమగ్ర గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. శాసనసభలో కూటమికి ఉన్న తిరుగులేని 164 స్థానాల బలం ఆధారంగా రాబోయే మూడేళ్లలో మండలి మాత్రమే కాకుండా పార్లమెంట్ ఎగువ సభ అయిన రాజ్యసభ సీట్లు కూడా ఏకపక్షంగా కూటమి ఖాతాలోనే పడనున్నాయి.ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలోని మొత్తం 58 స్థానాలు ఉన్నాయి. 2026 నుంచి మార్చి 2029 నాటికి సుమారు 30కి పైగా సభ్యుల పదవీ కాలం ముగియనుంది. ఇందులో ఎమ్మెల్యే కోటా, స్థానిక సంస్థల కోటా, గవర్నర్ నామినేటెడ్, ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలు ఉన్నాయి. గతంలో వైఎస్ఆర్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ ఖాతాలో పడిన స్థానాలన్నీ వరుసగా ఖాళీ అవుతూ వస్తున్నాయి. అసెంబ్లీలో ప్రతిపక్షానికి కనీస బలం కూడా లేకపోవడంతో, త్వరలో ఖాళీ కాబోయే ప్రతి ఒక్క సీటూ పోటీయే లేకుండా ఏకగ్రీవంగా టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఖాతాలోనే పడనున్నాయి. ముఖ్యంగా 2026 నుంచి 2027 చివరి నాటికి గవర్నర్ నామినేటెడ్ కోటాలో 6 సీట్లు, ఎమ్మెల్యే కోటాలో దాదాపు 7 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. దీనికి తోడు స్థానిక సంస్థల కోటాలో కూడా 10 స్థానాల గడువు ముగియనుంది. అప్పటికి స్థానిక ఎన్నికలు అయిపోతాయి. సహజంగానే అధికార పార్టీకి అడ్వాంటేజ్ ఉంటుంది. అసెంబ్లీలో కూటమికి ఉన్న సంపూర్ణ ఆధిక్యంతో ఎమ్మెల్యే కోటాలోని స్థానాలన్నీ కూటమికే దక్కుతాయి. మెజారిటీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కూటమి వైపు మొగ్గు చూపడం లేదా ఖాళీలు ఏర్పడటంతో ఆయా జిల్లాల్లో కూటమి అభ్యర్థుల విజయం సునాయాసంగా మారనుంది.2029 మార్చి నాటికి ఎమ్మెల్యే కోటాలో మరో 7 స్థానాలు ఖాళీ కానుండటంతో పాటు, పట్టభద్రుల. ఉపాధ్యాయుల స్థానాల గడువు కూడా పూర్తికానుంది. పట్టభద్రుల స్థానాల్లో ఇప్పటికే కూటమికి విపరీతమైన ఆమోదయోగ్యత ఉందని గత ఫలితాలు నిరూపించాయి. దీనివల్ల నాటి ఎన్నికల నాటికి శాసనమండలిలో వైఎస్ఆర్‌సీపీ ప్రాతినిధ్యం దాదాపు శూన్యానికి చేరుకుని, మండలిలో ఎన్డీయే కూటమికి తిరుగులేని సంపూర్ణ మెజార్టీ లభిస్తుంది. కేవలం శాసనమండలి మాత్రమే కాదు, ఢిల్లీలోని రాజ్యసభ సీట్ల సమీకరణలు కూడా కూటమికి అత్యంత సానుకూలంగా మారాయి. ఎంపీల పదవీకాల ముగింపు క్రమంలో 2028లో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాలు నూరు శాతం కూటమి ఖాతాలోనే పడనున్నాయి. కేంద్రంలోనూ ఎన్డీయే భాగస్వామిగా ఉన్న టీడీపీ-జనసేనలకు ఈ రాజ్యసభ స్థానాలు దక్కడం వల్ల జాతీయ రాజకీయాల్లోనూ కూటమి నేతల ప్రాధాన్యత, ప్రాతినిధ్యం మరింత పెరగనుంది.ఈ పరిణామాలన్నింటినీ విశ్లేషిస్తే, ప్రస్తుతం గవర్నర్ కోటాలోని రెండు ఎమ్మెల్సీ పదవుల కోసం టీడీపీ అగ్రనేతలపై ఒత్తిడి తేవడం లేదా నిరాశకు గురికావడం సమంజసం కాదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మూడేళ్ల వ్యవధిలో దాదాపు 30కి పైగా ఎమ్మెల్సీ స్థానాలు, 4 రాజ్యసభ స్థానాలు అందుబాటులోకి రానున్నందున.. పార్టీ కోసం పనిచేసిన సీనియర్లు, సామాజిక సమీకరణల్లో వెనుకబడిన నాయకులు, ఎన్నికల్లో త్యాగాలు చేసిన అభ్యర్థులకు విడతల వారీగా పదవులు అప్పగించేందుకు చంద్రబాబు వద్ద స్పష్టమైన రోడ్‌మ్యాప్ ఉందని చెబుతున్నారు. పార్టీ శ్రేణులు ఓపిక పడితే ప్రతి అర్హులైన నాయకుడికీ తగిన గుర్తింపు లభించడం ఖాయమని అంటున్నారు.

# తెయూ లో ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు




**డిచ్ పల్లి సెప్టెంబర్ 19 (ప్రజాగళం)**తెలంగాణ విశ్వవిద్యాలయం ఎన్ ఎస్ కేస్ యూనిట్-4 ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ డే 2026 వేడుకలను పురస్కరించుకొని ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ కొరియోగ్రాఫర్ తెలంగాణ స్టేట్ డ్యాన్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు వినయ్ మాస్టర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య. కె. అపర్ణ హాజరయ్యారు. కార్యక్రమం లో నృత్య కళాకారుడు వినయ్ మాస్టర్ యువ కళాకారులను ప్రోత్సహిస్తూ విద్యార్థులలోని సాంస్కృతిక ప్రతిభను వెలికితీ యడంలో వారికి పలు సూచనలతో పాటు మెలకువలు నేర్పించారు.ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ యూనిట్ -04 ప్రోగ్రామ్ ఆఫీసర్ నర్సయ్య, వివిధ విభాగాల అధ్యాపకులు, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

# కూటమికి టిక్కెట్ల సవాల్



**విజయవాడ,** : ఆంధ్రప్రదేశ్ రాజకీయం మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలు సమయం దగ్గర పడుతోంది. ఈ సారి ఎన్నికల బరిలో అధికార కూటమి ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కాదు.. ఆయా పార్టీల మధ్య సమన్వయమే. సార్వత్రిక ఎన్నికల్లో లభించిన క్లీన్ స్వీప్ విజయం తర్వాత, క్షేత్రస్థాయిలో కూటమి గ్రాఫ్ బలంగా ఉంది. వైసీపీ రక్షణాత్మక ధోరణిలో ఉండటంతో, తాము గెలుపు గుర్రాలమనే ధీమా కూటమి నేతల్లో అత్యధికంగా ఉంది. ఫలితంగా, అసలు పోటీ ప్రతిపక్షంతో కాదని, టిక్కెట్ల కోసం తమలో తామే పోటీ పడాల్సి ఉంటుందని కూటమి అగ్రనాయకత్వానికి ముందే అర్థమైంది. కింది స్థాయి నేతలంతా తామంటే తామే పోటీ చేస్తామని ఎగబడుతుండటంతో సీట్ల పంపకం, సమన్వయం అనేది ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది.ఈ అంతర్గత పోటీని, అసమ్మతిని ముందే పసిగట్టిన కూటమి పెద్దలు అప్రమత్తమయ్యారు. ఎక్కడికక్కడ మున్సిపల్ వార్డులు, ఎంపీటీసీ స్థానాల వారీగా ఏ పార్టీ ఏ స్థానంలో పోటీ చేయాలనే దానిపై ఓ స్పష్టత తెచ్చేందుకు తెరవెనుక ప్రత్యేక సమన్వయ సమావేశాలు నిర్వహించారు. గత ఎన్నికల ఓట్ల శాతం, స్థానిక బలాబలాలు , ఇరు పార్టీల నేతల అంగీకారం ఆధారంగా ఒక స్థూల ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఈ చర్చలు ప్రాథమికంగా ఒక కొలిక్కి రావడంతోనే ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ఏ ఒక్క స్థానంలో కూడా ఓట్ల చీలిక రాకుండా, పరస్పరం సహకరించుకునేలా కింది స్థాయి క్యాడర్‌ను మానసికంగా సిద్ధం చేస్తున్నారు.మరోవైపు, జనసేన పార్టీలో ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా గ్రౌండ్ వర్క్ నడుస్తోంది. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా కూటమి సమన్వయంపై గట్టి సంకేతాలే ఇచ్చారు. కూటమి శ్రేణుల మధ్య ఐక్యత మిస్ కాకూడదని, సీట్ల సర్దుబాటులో ఒకరికొకరు గౌరవం ఇచ్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అంతేకాకుండా, గత ఐదేళ్లుగా పార్టీ కోసం నిలబడి, జెండా మోసి కష్టపడిన నిజమైన జనసైనికులకు ఈ స్థానిక ఎన్నికల్లో సముచిత స్థానం కల్పించేలా జనసేన అధిష్టానం ఇప్పటికే అంతర్గతంగా సమాచార సేరణ పూర్తి చేసింది. పార్టీ గెలిచే అవకాశాలు ఉన్న స్థానాల జాబితాను సిద్ధం చేసి, చంద్రబాబుతో సీట్ల సర్దుబాటు చర్చలకు పక్కా వ్యూహంతో సిద్ధమైంది.మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వార్డుల స్థాయిలో గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉండటంతో, క్షేత్రస్థాయి నేతల్లో ఆశావహుల సంఖ్య వేలల్లో ఉంది. సీటు దక్కని పక్షంలో తిరుగుబాటు అభ్యర్థులుగా బరిలోకి దిగే ప్రమాదం కూడా లేకపోలేదు. అలాంటి చోట్ల ఆశావాహులను బుజ్జగించి, కూటమి క్రమశిక్షణను కాపాడటంలోనే మూడు పార్టీల సమన్వయకర్తల అసలు పరీక్ష దాగి ఉంది. ఏదేమైనా, ఈ లోకల్ బాడీ ఎన్నికలను విజయవంతంగా ముగించి తమ ఆధిపత్యాన్ని నిరూపించుకోవాలని కూటమి భావిస్తుండటంతో, సీట్ల పంపకాల వ్యూహం కీలకం కానుంది.ధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై తీవ్ర కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రంలో ఐదేళ్ల కాలపరిమితి ముగిసిన స్థానిక సంస్థలకు వీలైనంత త్వరగా ఎన్నికలు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే రాబోయే సెప్టెంబర్ నెలలోనే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం , ఎన్నికల సంఘం ఒక పక్కా ప్రణాళికను సిద్ధం చేశాయి.ఎన్నికల నిర్వహణ వ్యూహంలో భాగంగా ప్రభుత్వం
ఒక కీలక నిర్ణయానికి వచ్చింది. రాష్ట్రంలో ఒకేసారి కాకుండా విడతలవారీగా ఎన్నికలను జరపాలని భావిస్తోంది. ఇందులో భాగంగా తొలుత పట్టణ ప్రాంతాల్లోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేందుకు మొగ్గు చూపుతోంది. ఆ తర్వాత గ్రామీణ పరిధిలోకి వెళ్తూ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను పూర్తి చేయాలని ప్రణాళిక రచించింది. ఈ రెండు దశలు ముగిసిన అనంతరం ఆఖరిగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు వెళ్లాలనేది ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది.జూలై 27వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 45 రోజుల పాటు సుదీర్ఘంగా డోర్ టూ డో కార్యక్రమాన్ని చేపట్టాలని పార్టీ అధిష్ఠానం క్యాడర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# భారతికి కిలక బాధ్యతలు



**కడప,** : వైసీపీలో అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్ర ఎంత కీలకమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ఆయన నాయకత్వమే ప్రధాన బలంగా నిలిచింది. పార్టీ విజయాలు, పరాజయాలు, రాజకీయ నిర్ణయాలు అన్నీ కూడా జగన్ చుట్టూనే తిరిగాయి. అయితే మారుతున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పార్టీ నిర్వహణలో మరో కీలక నాయకత్వం అవసరమనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.గతంలో విజయసాయిరెడ్డి పార్టీ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించారని భావించేవారు. ఆయన పార్టీకి దూరమైన తర్వాత ఆ బాధ్యతలను సజ్జల రామకృష్ణారెడ్డి సమన్వయం చేస్తున్నారని ప్రచారం ఉన్నప్పటికీ, పార్టీ అంతర్గత వ్యవహారాల్లో ఇంకా మార్పులు అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు నేతలు కోటరీ రాజకీయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారనే ప్రచారం కూడా సాగుతోంది.ఈ పరిస్థితుల్లో భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జగన్ కొత్త వ్యూహం సిద్ధం చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రానున్న సంవత్సరాల్లో ఆయన ప్రజల మధ్య ఎక్కువ సమయం గడపాలని, రాష్ట్రవ్యాప్తంగా విస్తృత పర్యటనలు చేపట్టాలని భావిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అలాంటి సమయంలో పార్టీ రోజువారీ వ్యవహారాలను చూసుకునే నమ్మకమైన నాయకత్వం అవసరమని ఆయన భావిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. జగన్ సతీమణి వైఎస్ భారతి పేరు ఎక్కువగా వినిపిస్తోంది. కుటుంబ సభ్యురాలు కావడం, సంస్థాగత వ్యవహారాలపై అవగాహన ఉండడం, నాయకత్వంపై పూర్తి విశ్వాసం ఉండడం వంటి కారణాలతో ఆమెకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇతర నేతలకు అలాంటి బాధ్యతలు ఇస్తే అంతర్గత విభేదాలు వచ్చే అవకాశం ఉంటుందని కొందరు అభిప్రాయపడుతుండగా, భారతి అయితే అందరినీ సమన్వయం చేయగలరని కూడా అంటున్నారు.ఇప్పటి వరకు భారతి ప్రత్యక్ష రాజకీయాల్లో పెద్దగా చురుకుగా కనిపించలేదు. అయితే ఎన్నికల సమయంలో పులివెందుల ప్రాంతంలో జగన్ తరఫున ప్రచారం నిర్వహించిన సందర్భాలు ఉన్నాయి. అలాగే వ్యాపార, సంస్థాగత అంశాల నిర్వహణలో ఆమెకు అనుభవం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ అనుభవం పార్టీ నిర్వహణలో కూడా ఉపయోగపడుతుందని కొందరు విశ్లేషిస్తున్నారు.రానున్న సాధారణ ఎన్నికల్లో కడప లోక్‌సభ స్థానం నుంచి భారతిని పోటీ చేయించే అవకాశాన్ని జగన్ పరిశీలిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వైఎస్ అవినాష్ రెడ్డి ఇప్పటికే వరుస విజయాలు నమోదు చేశారు. అయితే భవిష్యత్తులో భారతిని బరిలోకి దింపితే ఆ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ స్థానాలపై కూడా పార్టీకి మరింత బలం చేకూరుతుందనే అంచనాలు కొందరు వ్యక్తం చేస్తున్నారు.అయితే ఇవన్నీ ఇప్పటికైతే అధికారికంగా ధృవీకరించబడిన విషయాలు కావు.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com